క్లుప్తంగా

హైందవ శంఖారావం సభకు ఆహ్వానం



గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో 2025 జనవరి 5వ తేదీన విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు శ్రీభువనేశ్వరీ పీఠాధిపతులు కమలా నందభారతీ స్వామీజీని వీహెచ్‌పీ నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం కేసరపల్లి శివారు చిదానంద ఆశ్రమంలో పీఠాధిపతులను కలిసిన వీహెచ్‌పీ నేతలు కొండరెడ్డి, తనికెళ్ల సత్యరవికుమార్, శ్రీనివాసరెడ్డి, జీ. నవీన్, వెలుగంటి శివాజీ ఆహ్వాన పత్రికను అందజేశారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తికి, దేవాలయాల నిర్వహణలో సంస్కరణకు విహెచ్‌పీ జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందని నేతలు తెలిపారు. హైందవ శంఖారావం విజయవంతం చేసేందుకు హిందువులందరూ కలిసి రావాలని వారు పిలుపునిచ్చారు.

మోమినషానవాజ్‌కు పీహెచ్‌డీ



పెనమలూరు: గంగూరు గ్రామానికి చెందిన ఎండీ మోమినషానవాజ్ పీహెచ్‌డీ పొందింది. ఆమె వరంగల్ ఎన్ఐటీలో బయోటెక్నాలజీలో పరిశోధన విజయవంతంగా చేయటంతో పీహెచ్‌డీ సాధించింది. ఈ మేరకు వరంగల్ ఎన్ఐటీలో ఇటీవల జరిగిన 22వ స్నాతకోత్సవంలో ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి పీహెచ్‌డీ పట్టాను మోమినషానవాజ్‌కు ప్రదానం చేశారు. మోమినషానవాజ్‌కు గంగూరు సర్పంచి తస్లీమున్నీసా, బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

పెనమలూరు: వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా గాజుల లంకకు చెందిన నడకుదుటి సంతోషం కొన్నేళ్ల క్రితం నాగరాజును వివాహం చేసుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. కాగా భర్తతో కలహాలు రావటంతో ఆమె పిల్లలతో వచ్చి గంగూరు కాలువ కట్టపై ఉంటూ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. మద్దూరుకు చెందిన ఆమె బంధువు పీతా రమేష్ ఆమె ఇంటికి వచ్చి అసభ్యంగా ప్రవర్తించసాగాడు. తన ఇంటికి రావద్దని సంతోషం అభ్యంతరం తెలిపింది. దీంతో సంతోషం ఎక్కడికి వెళ్లినా రమేష్ వెంటపడి వేధిస్తూ అసభ్యంగా ప్రవర్తించసాగాడు. దీంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యాన్ని ఛేదించిన పోలీసులు



పటమట(విజయవాడతూర్పు): పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందలించాడని స్కూలు నుంచి వెళ్లిపోయిన విద్యార్థి ఆచూకీని పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌లో విజయవాడ కమిషనరేట్ సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ దామోదర్ మాట్లాడుతూ రామవరప్పాడుకు చెందిన బాలుడు స్థానికంగా ఉన్న పాఠశాల్లో ఏడో తరగతి చదువుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో స్కూలకు దగ్గరలో ఉన్న కిరాణా దుకాణంలో యజమానికి తెలియకుండా తినుబండాలను తీసుకోవటంతో కిరాణా దుకాణం యజమాని స్కూలు ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై హెచ్ఎం విద్యార్థిని మందలించటంతో భయమేసిన విద్యార్థి పారిపోయాడు. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు 13 గంటల్లో కేసును ఛేదించి బాలుడి ఆచూకీని రామవరప్పాడులోనే కనుగొని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. సమావేశంలో పటమట సీఐ పవన్ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

శివమోహినీదేవిగా భ్రమరాంబ అమ్మవారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ అమ్మవారు శనివారం శివమోహినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలో పురాతన ఆలయమైన పాతశివాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్త దీక్ష మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. శివమోహినిదేవిగా దర్శనమిచ్చిన శ్రీ భ్రమరాంబ అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన కార్యక్రమాలను నిర్వహించారు.

- తుపాను ప్రభావంతో జిల్లాలో మోస్తరుగా వర్షం
- గాలులకు నేలవాలిన వరి చేలు
- ధాన్యం సంరక్షణలో రైతులు



కంకిపాడులో నేలవాలిన వరి పొలాలు

ఫెంగల్.. గజ గజ

కంకిపాడు: ఫెంగల్ తుపాను బెంగ రైతులను కలవరపరుస్తోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట ఎక్కడ తుపాను బారిన పడుతుందోనన్న భయం అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కోత కోసి మిల్లులకు తరలించేందుక సిద్ధం చేసిన ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. జిల్లాలో పలు చోట్ల కురిసిన వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కృష్ణా జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.64 లక్షల హెక్టార్లలో వరి సాగు జరిగింది. ఎంటీయూ, బీపీటీ, ఇతర సాధారాణ రకాలను రైతులు సాగు చేశారు. సెప్టెంబరులో కృష్ణా నదికి సంబంధించిన వరదలు, భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 44,521 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేసి నివేదించటం తెలిసిందే. వరదలు, వర్షాల నుంచి తేరుకుని సాగులో నిమగ్నమైన రైతాంగం 10 రోజులుగా వరి కోతలు కోస్తూ పంటను మిల్లులకు తరలిస్తున్నారు.

వాతావరణ మార్పులతో ఆందోళన

ఇప్పటి వరకూ సివిల్ సప్లయిస్ అధికారులు 60 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు. అయితే ఫెంగల్ తుపాను హెచ్చరికలతో అన్నదాతల్లో భయం నెలకొంది. శుక్రవారం రాత్రి మోస్తరు జల్లులు పడ్డా, శనివారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వాతావరణం కారుమబ్బులు కమ్మి మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం కూడా తుపాను ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే

వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు యంత్రాలతో కోతలు కోయించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రధానంగా రోడ్ల మార్జిన్‌లు, రియల్ వెంచర్లలో రాశులుగా పోసి ఉంచారు. రైతుల వద్ద ఇంకా 25 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉన్నట్లు అంచనా. పచ్చి మీద ధాన్యం కోత కోసి కాటాలు వేసి మిల్లులకు తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కాటా వేసి ధాన్యం వర్షానికి తడిచిపోకుండా టార్పాలిన్‌లు కప్పి సంరక్షిస్తున్నారు. కాటాలు వేసేందుకు కూలీలు ఉన్నా, పచ్చి ధాన్యం కావటంతో సంచులు ఇవ్వలేదని, కాటా వేసేందుకు ఆస్కారం లేకుండా పోయిందని కంకిపాడుకు చెందిన రైతు శ్రీనివాసరావు, దావులూరుకు చెందిన సాంబయ్య వాపోయారు. నేల వాలిపోవటంతో ధాన్యం పూర్తి స్థాయిలో చేతికి అందే పరిస్థితి లేదని, ఎకరాకు 4 బస్తాలకు పైగా ధాన్యం నేల పాలవుతుందని ఆందోళన చెందుతున్నారు.



తాడిగడపలో ధాన్యానికి పట్టాలు కప్పుతున్న రైతులు

న్యాయం చేయాలి

పెనమలూరు: రైతులు ఎంతో కష్ట నష్టాలు పడి వరి సాగు చేస్తే ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉంది. ఫెంగల్ తుపాను కారణంగా శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతులు బెంబేలెత్తిపోయారు. పంటను కాపాడుకోవటానికి ఉరుకులు పరుగులు తీశారు. మండల పరిధిలో దాదాపు 5,500 ఎకరాల్లో సార్వా వరి సాగు జరిగింది. ఇప్పటి వరకు 1,500 ఎకరాల్లో వరి కోతలు జరిగాయి. 1,500 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించగా ఇంకా రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్లపైనే ఆరబెట్టి ఉంది. మిగతా పంట కూడా కోతలు కోయటానికి సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం నుంచి సానుకూల పరిస్థితులు కల్పించకపోవటంతో పంట పొలాల్లోనే పంట ఉండిపోయింది. గత 10 రోజులుగా రైతులు పంట తరలింపుపై మొరపెట్టుకున్నా ప్రభుత్వం రైతులకు న్యాయం చేయలేక పోయింది. దీంతో ధాన్యం పంట గ్రామాల్లో రహదారులపై ఉంచారు. మరో వైపు తుపాను ముంచుకు వచ్చింది. మండల పరిధిలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఆరుబయట ఉన్న ధాన్యం రాశులు కాపాడు కోవటానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు అందుబాటులో ఉన్న రైతులు ధాన్యం తడవకుండా కప్పారు. కొందరి రైతులు ఆరపెట్టిన ధాన్యం వర్షానికి తడిచింది. తాము ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటకు ప్రభుత్వమే తమకు తగిన న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. తేమ శాతం పేరుతో మిల్లర్లు వేధింపులు ఆపాలన్నారు. వర్షం వలన పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తమకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



గోసాలలో బస్తాలు లాటు వేస్తున్న రైతు కుటుంబం

తుపాను సాకుతో ధర తగ్గింపు

ఉంగుటూరు: తుపానును సాకుగా చూపుతూ రైతుల వద్ద ధాన్యాన్ని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. వారం రోజులుగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు యంత్రాలతో వరి పంటకోసి వెంటనే అమ్మేస్తున్నారు. దీంతో దళారులు, మిల్లర్లు తేమశాతం పేరుతో 75 కిలోల బస్తాకు కేవలం రూ.1,450 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తేమ శాతం చూసి ప్రభుత్వం నిర్దేశించిన ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. శనివారం పలు ప్రాంతాల్లో వర్షం జల్లులు పడటంతో రైతులు ధాన్యం రాసులపై పట్టాలు కప్పి భద్రపరచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

వరి కోతలు వద్దు



తాడిగడపలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఏవో శైలజ

పెనమలూరు: వాతావరణ పరిస్థితులు బాగా లేనందున వరి కోతలు ప్రస్తుతం కోయవద్దని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. మండల పరిధిలో పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఫెంగల్ తుపాను కారణంగా రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కోతలు రెండు రోజులు వాయిదా వేసి ఆలస్యంగా కోయాలన్నారు. చిరు జల్లులు కారణంగా ధాన్యం రాసులు తడవకుండా ఉండటానికి పట్టాలు కప్పాలని సూచించారు. ధాన్యం తడిచే పరిస్థితి ఉంటే సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. గ్రామాల స్థాయిలో సిబ్బంది రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు.

సైబర్ సెక్యూరిటీపై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ సైబర్ భద్రతా దినోత్సవం సందర్భంగా శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు సైబర్ భద్రత, నైతిక హ్యాకింగ్, క్రిప్టో కరెన్సీ, మాల్వేర్ నుంచి రక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగించేలా పోస్టర్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అనేది డిజిటల్ ప్రపంచంలో పెద్ద ముప్పుఅని తెలిపారు. ఈ క్రైమ్స్‌లో పర్సనల్ డేటా దొంగతనం, ఆన్‌లైన్ మోసాలు, కంప్యూటర్ వ్యవస్థలపై దాడులు జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో చేసే అన్ని కార్యకలాపాలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్ క్రైమ్స్, భద్రత చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్. మాధవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం.ప్రవీణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం టీటీడీ కల్యాణ మండపంలో దాతలు డాక్టర్ బీవీ రంగారావు, వెంకట నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో 200 మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలో శ్రీవారికి ఉపయోగించిన పూలతో తయారు చేసిన అగరుబత్తీ, సబ్బులు తదితరాలను విక్రయించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి మాట్లాడుతూ శుక్ర, శని, ఆదివారాల్లో అన్న ప్రసాదం అందిస్తామని తెలిపారు. బుధవారం నుంచి టీటీడీ ప్రచురించిన డైరీలు, క్యాలెండర్‌లు, చిన్న క్యాలెండర్లు భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

వంశీమోహన్ అనుచరులకు ముగిసిన పోలీస్ కస్టడీ



మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరులను కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

గన్నవరం: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై దాడి కేసులో అరెస్టయ్యినా ఎనిమిది మంది నిందితుల రెండు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో గన్నవరం కోర్టులో శనివారం హాజరుపరిచారు. ఈ ఏడాది జనవరి 20న విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద రంగబాబుపై జరిగిన దాడి కేసులో పోలీసులు ఇటీవల పునర్ విచారణ చేపట్టారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ ముఖ్య అనుచరులైన తొమ్మిది మందిని కొత్తగా నిందితుల జాబితాలో చేర్చారు. వీరిలో ఓలుపల్లి మోహన్ రంగా, ఎంపీపీ అనగాని రవి, తేలప్రోలు రాము, మేచినేని బాబు, సూరపనేని అనిల్‌కుమార్, గుర్రం నాని, కర్నాటి నిరంజన్, గొన్నూరు శీనయ్యను ఈ నెల 19న అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో పోలీసుల రెండు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో నవంబర్ 29న సెంట్రల్ జైలు నుంచి పెడన పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. పోలీస్ కస్టడీ శనివారం సాయంత్రానికి ముగియడంతో నిందితులను మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ పరీక్షలు చేయించారు. అనంతరం గన్నవరంలోని 8వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎదుట వారిని హాజరుపరిచారు. అనంతరం వారిని రిమాండ్ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలుకు పోలీసుల భద్రత మధ్య బస్సులో తరలించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



జీటీవీ రమణ దంపతులను సత్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

రామవరప్పాడు: విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని నున్న సర్పంచ్ కాటూరి సరళ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న పంచాయతీ కార్యాలయంలో శనివారం కార్యదర్శి జీటీవీ రమణ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామాభివృద్ధికి విశేష కృషి

ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ శాఖలో గత 40 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పని చేసి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ నున్న గ్రామ కార్యదర్శిగా సుమారు 5 సంవత్సరాలు విధులు నిర్వహించి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శులు సంఘం జనరల్ సెక్రటరీగా రమణ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, నాయకులు దండు సుబ్రహ్మణ్యం రాజు, బాలశేఖరరెడ్డి, కలకోటి శ్రీనివాసరెడ్డి, బ్రహ్మనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యువ ఉత్సవ్ స్ఫూర్తిదాయకం



విద్యార్థులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వీసీ వెంకటేశ్వరరావు తదితరులు

పెనమలూరు: యువ ఉత్సవ్ కార్యక్రమం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా, దేశభక్తిని పెంపొందించుకునే విధంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్‌కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శనివారం నెహ్రూ యువకేంద్రం, కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్-2024 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. యువత సానుకూల దృక్పథంతో పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. వైస్ చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. యువత పోరాటపటిమతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము మాట్లాడుతూ.. స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు లక్ష్యాలను సాధించాలన్నారు. 2047 నాటికి ప్రపంచ దేశాల్లో భారత్ దిక్సూచిలా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం



మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం కార్తిక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉపాలయంలోని శ్రీఆంజనేయస్వామి వారికి పది వేల తమల పాకులతో విశేష అర్చనలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు గోవిందనామం, శంఖు చక్రాలు, ఓంకారం, స్వస్తిక్, అష్టదళ పదపద్మం ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

– గన్నవరం

అలరించిన ఆపాత మధురాలు

విజయవాడ కల్చరల్: ఆర్ రాజు మెలోడీస్ ఆధ్వర్యంలో తొలి కార్యక్రమంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు, రాజు ఆధ్వర్యంలో ఘంటసాల, పీబీ శ్రీనివాస్, మాధవపెద్ది సత్యం, జేసుదాసు రచించిన గీతాలను మధురంగా ఆలపించారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, మహేశ్వరి, సీత, మాంతి రమణారావు తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

విద్యాభివృద్ధికి రామచంద్రమ్మ కృషి



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శనివారం కళాశాల యాజమాన్య కమిటీ మాజీ అధ్యక్షురాలు మోటపర్తి రామచంద్రమ్మ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వీకేఆర్ కళాశాలను ఇక్కడ ఏర్పాటు చేయడంలో ఆమె ముఖ్యపాత్ర వహించారన్నారు. ఫలితంగా వేలాది మంది విద్యార్థులు ఈ కళాశాలలో చదువుకునే ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అనంతరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు నవీన్‌కుమార్, తేజాకుమారి, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కంకిపాడులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమాన్ని అన్ని వర్గాలకూ చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, రమణ, రాం-లక్ష్మణ్ ఉన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

పెనమలూరు: గ్రామాల్లో సామాజిక పింఛన్ లబ్ధిదారులకు పింఛన్‌ను శనివారం సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. తాడిగడప మున్సిపాలిటీలో 12,672 మంది పింఛన్‌దారులకు రూ.5,42,43,500 సొమ్ము మంజూరు చేసి విడుదల చేశారు. సాయంత్రానికి 11,045 మందికి రూ.4.71 కోట్లు పింఛన్లు పంపిణీ చేశారు. పెనమలూరు మండలంలో 5,745 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా వారికి రూ.2,41,57,500 నిధులు మంజూరు చేశారు. 5,299 మందికి రూ.2.22 కోట్లు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.